# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 122 EDITOR: CHERUKU UPENDAR, DATE : FRIDAY 08 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 122 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 08 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## తమిళనాడు గవర్నర్‌గా రజనీకాంత్..?

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



సూపర్ స్టార్ రజనీకాంత్ గురించి ఇప్పుడు కొత్తగా పరిచయం చేయాల్సిన పనిలేదు. ఒక సాదారణ బస్ కండక్టర్ నుంచి తలైవా అని పిలిపించుకునే లెజెండరీ నటుడాయన. ఎలాంటి సినీ బ్యాగ్రౌండ్ లేకుండా స్వశక్తితో ఎదిగిన రజనీ.. ఎందరికో ఆదర్శంగా నిలిచారు. దేశ

మిగతా 2లో...

## రాహుల్ జోడో యాత్ర 2.0కు రెడీ



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు శ్రీకారం చుట్టి సెప్టెంబర్ 7న ఏడాది పూర్తి అవుతోంది. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ గాంధీ 4 వేల కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేస్తూ జనంతో మమేకమయ్యారు. జోడో యాత్ర తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ భారత్ జోడో యాత్ర 2పై అప్ డేట్ ఇచ్చింది. త్వరలోనే రెండో దఫా యాత్రను రాహుల్ గాంధీ చేపట్టనున్నారని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియా అధికారిక ఖాతాల్లో పోస్ట్ చేసింది. రెండో దశ యాత్రకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ త్వరలోనే వెల్లడించాలని పార్టీ అధిష్టానం ప్లాన్ చేసింది. 2022 సెప్టెంబర్ 7 ప్రారంభం అయిన రాహుల్ భారత్ జోడో యాత్ర ఈ ఏడాది జనవరి 30 వరకు కొనసాగింది. కన్యాకుమారిలో మొదలుపెట్టిన తొలి దశ జోడో యాత్ర ఈ


మిగతా 2లో...

## హైదరాబాద్‌లో... పెరుగుతున్న డెంగీ కేసులు

### జులై చివరికి 961 కేసులు.. ఆగస్టులో మాత్రమే 200

### ఆసుపత్రుల్లో పెరిగిన 30 శాతం ఓపీలు






హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో డెంగీ విజృంభిస్తోంది. గత కొన్ని రోజుల నుంచి డెంగీ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది జులై చివరి నాటికి 961 కేసులు నమోదయ్యాయి. అయితే ఆగస్టు నెలలో మాత్రం 200కి పైగా వచ్చాయి. అయితే తాజాగా కురిసినటువంటి వర్షాల వల్ల రాబోయే రోజుల్లో కూడా డెంగీ కేసులు మరంతగా పెరుగుతాయని.. వైద్యారోగ్య శాఖ భావిస్తోంది. అలాగే ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు కూడా భారీగానే ఉన్నారు. ఇంకా ప్రభుత్వ ఆసుపత్రుల్లో బాధితుల సంఖ్య ఇంకా ఎక్కవగానే ఉంటారని అంచనా వేస్తోంది. అయితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చూసుకుంటే ఈ ఏడాది ఇప్పటిదాకా 168 కేసులు నమోదయ్యాయి. అలాగే అక్కడ ప్రైవేటు ఆసుపత్రులకు తూడా తాకిడి ఎక్కువగానే ఉంటోంది. ఖమ్మం జిల్లాలోని ఆగస్టు నెలలో 61 మంది ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు.అయితే ఈ జిల్లాలో గత ఐదు రోజుల్లోనే 23 కేసుల వరకు నమోదయ్యాయి. తాజాగా బుధవారం రోజున ఖమ్మం జిల్లాలో ఒక్కరోజే 14 కేసులు వచ్చాయి. అయితే ముందు ముందు కేసుల సంఖ్య మరింతగా పెరుగుతుందని అంచనా వేసినట్లు ఏజెన్సీతో ముడిపడి ఉన్న డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. తాజాగా కురిసిన వర్షాల వల్ల ఈ నెల మూడోవారం

మిగతా 2లో...

## అతిధి సత్కారాలకు పెద్ద పీట

### వెండి పళ్లాలలో మెనూ




న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

భారత్‌లో కనీవినీ ఎరుగని రీతిలో జీ20 శిఖరాగ్ర సదస్సుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా 9, 10 తేదీల్లో జరిగే జి-20 సదస్సుకు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం జీ-20 సదస్సుపై ప్రపంచం మొత్తం చూపు భారత్‌పైనే ఉంది.

మిగతా 2లో...

## ఖండాంతరాలు దాటనున్న పుట్టపాక చేనేత కళాకారుల ఖ్యాతి

### ఫ్రాన్స్ ప్రథమ పౌరురాలు బ్రిగిట్టే మెక్రాన్‌కు దుబీయన్ చీరను బహూకరించిన ప్రధాని మోదీ

పుట్టపాక - ప్రభాత సూర్యుడు



పుట్టపాక తేలియా రుమాలును ఇక ప్రపంచం మొత్తం ఘనంగా కీర్తించనున్నది. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలోని గురుగ్రామ్‌లో జరిగే జీ-20 సమావేశాల్లో భారతీయ హస్తకళల ప్రదర్శనలో భాగంగా పుట్టపాక చేనేత కళాకారులు తయారు చేసిన తేలియా రుమాలును ప్రదర్శించనుండడంతో పుట్టపాక చేనేత కళాకారుల ఖ్యాతి ఖండాంతరాలు దాటనున్నది. ఇటీవల భారత ప్రధాని మోదీ ఫ్రాన్స్ దేశ పర్యటనలో భాగంగా ఆ దేశ అధ్యక్షుడి భార్య బ్రిగిట్టే మెక్రాన్‌కు పుట్టపాక చేనేత కళాకారుల తయారు చేసిన దుబీయన్ చీరెను బహూకరించడంతో పుట్టపాక ఖ్యాతి ఖండాంతరాలకు చేరింది. పుట్టపాక చేనేత కళాకారులు తయరు చేసిన తేలియా రుమాలు, డబుల్ ఇక్కత్ చీరె, డబుల్ ఇక్కత్ డాబిబోన్ చీరె, డబుల్ ఇక్కత్ డాబిబోన్ దుబ్బుటి తదితర వస్త్రాలను ఇప్పటికే ప్రపంచ దేశాలు ఆకర్షిస్తున్నాయి. పుట్టపాక చేనేత కళాకారుల నైపుణ్యానికి వారిని ఇప్పటికే రెండు పద్మశ్రీ అవార్డులతోపాటు పలు జాతీయ అవార్డులు వరించాయి.

మిగతా 3లో...

## హోంగార్డులకు అండగా వుంటాం

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

17 సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్న హోంగార్డు రవీందర్ ఆత్మహత్యయత్నం బాధా కరం, దురదృష్టకరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హోంగార్డు వ్యవస్థలో శ్రమ దోపిడీ జరుగుతుంది. తెలంగాణ ప్రభుత్వం హోంగార్డు వ్యవస్థను అవమానిస్తోంది. హోంగార్డు సంక్షేమం కోసం నిరంతర పోరాటం చేసాను. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు హోంగార్డు హక్కుల, సమస్యల కోసం ప్రభుత్వన్ని నిలదిశం. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు ఎక్కడ అమలు కాలేదు. హోంగార్డు వ్యవస్థను క్రమబద్ధీకరణ

మిగతా 2లో...

## సీనియర్లు దరఖాస్తు చేసుకోవాల్సిందే



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో బీజేపీ దుకూడు పెంచింది. ఈ క్రమంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభ్యర్థుల ప్రకటనకు ముందు ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మూడో రోజు దరఖాస్తు స్వీకరణ కార్యక్రమం జరుగుతోంది. ఈ క్రమంలో ఆశావహుల నుంచి దరఖాస్తు స్వీకరణపై బీజేపీ అధిష్టానం ఆరా తీసింది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల లెక్కలను అడిగి తెలుసుకుంది. కీలక నేతల అప్లికేషన్లు కనిపించడకపోవడంతో హైకమాండ్ గుర్రుగా ఉంది. ఏ స్థాయి నేత అయినా అందరికీ ఒకటే రూల్ అని స్పష్టం చేసింది. ఇందులో ఎవరికీ మినహాయింపులు ఉండబోవని, ప్రతి ఒక్కరూ దరఖాస్తు

మిగతా 2లో...

## 4 లక్షల ఉచిత విగ్రహాలు

### అంబరాన్నంటుతున్న నవరాత్రి ఉత్సవాలు


హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



హైదరాబాద్ లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంబరాన్నంటుతాయి. ముంబయి తర్వాత ఆ స్థాయిలో వినాయక చవితి వేడుకలు జరిగేది హైదరాబాద్ లోనే. గ్రేటర్ పరిధిలో వేలాది గణనాథులు కొలువుదీరుతాయి. ఈ వేడుకలను చూసేందుకు వివిధ జిల్లాల నుంచి కూడా ప్రజలు తరలివస్తుంటారు. నిమజ్జనం రోజు వేడుకలు అంతకుమించి ఉంటాయి. ఈ ఏడాది కూడా గణేష్ నవరాత్రి వేడుకలు అట్టహాసంగా జరిగేందుకు గ్రేటర్ సమాయత్తం అవుతోంది. అన్ని శాఖల అధికారుల భాగస్వామ్యం, ఉత్సవ సమితుల సమన్వయంతో కన్నుల పండుగ్గా ఉత్సవాలు నిర్వహించేందుకు రాజధాని సన్నద్ధమవుతోంది. పర్యావరణ హితమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏల ఆధ్వర్యంలో 4.10 లక్షల మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు జీహెచ్ఎంసీ మేయర్ తెలిపారు. భక్తులకు సకల వసతులు కల్పిస్తూనే, అత్యవసర సేవల్లో భాగంగా వైద్య శిబిరాలు, అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గణేశ్ నిమజ్జనం, శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేలా చెరువులు, రహదారుల వద్ద ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గణేష్ ఉత్సవాల వేళ హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు 10,500 మంది పారిశుద్ధ్య కార్మికులను మూడు

మిగతా 2లో...

## కాంగ్రెస్‌లో టికెట్ల కోసం కుస్తీ



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ కాంగ్రెస్‌లో టికెట్ల రేస్ కొనసాగుతోంది. ఇప్పటికే అధికార బీఆర్ఎస్ అభ్యర్థులను బరిలోకి దించితే.. కాంగ్రెస్ ఇంకా టికెట్ల కోసం కుస్తీ చేస్తునే ఉంది. ఒకటి రెండు కాదు.. మూడ్రోజులుగా స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థుల జాబితాపై ఫుల్

మిగతా 3లో...

# రాహుల్ జోడో యాత్ర 2.0కు రెడీ

(మొదటిపేజీ తరువాయి)

జనవరి 30న కాశ్మీర్ లో రాహుల్ విజయవంతంగా పూర్తి చేశారు. మొత్తం 12 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల మీదుగా 4,081 కిలోమీటర్ల పాటు యాత్ర సాగింది. 145 రోజుల పాటు కొనసాగిన తొలి విడత భారత్ జోడో యాత్రలో 75 జిల్లాల్లో పాదయాత్ర చేయగా.. 76 లోక్ సభ నియోజకవర్గాలను కవర్ చేశారు. 100 కార్నర్ మీటింగ్స్ నిర్వహించగా, 275 చోట్ల వాకింగ్ ఇంటరాక్షన్, 12 సార్లు ప్రెస్ కాన్ఫరెన్స్ లో రాహుల్ గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్ భావజాలాన్ని స్పష్టం చేశారు.తమిళనాడులో మొదలుపెట్టిన రాహుల్ జోడో యాత్ర కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ మీదుగా జమ్మూ కాశ్మీర్ వరకు కొనసాగింది. అత్యధికంగా ఎన్నికలు జరిగిన కర్ణాటకలో 21 రోజులు పాదయాత్ర చేశారు రాహుల్. అక్కడ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. అత్యల్పంగా హిమాచల్ ప్రదేశ్ లో ఒక్కరోజు, ఢిల్లీలో రెండు రోజులు రాహుల్ పాదయాత్ర చేశారు. ఏపీలో 4 రోజులు, తెలంగాణలో 12 రోజులపాటు పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీ పార్టీ కీలక నేతలతో సమావేశమై పార్టీ పరిస్థితిపై చర్చించారు2024 లోక్‌సభ ఎన్నికలు ఇంక మిగిలుంది 6 నెలలు మాత్రమే. దాంతో కాంగ్రెస్ పార్టీ తమ వ్యూహాలకు పదును పెట్టింది. గుజరాత్ నుంచి మేఘాలయ వరకు రాహుల్ గాంధీ రెండో విడత పాదయాత్రను ప్లాన్ చేసినట్లు మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే ఇటీవల తెలిపారు. రాహుల్ యాత్ర కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడింది. దాంతో రెండో విడత భారత్ జోడో యాత్రకు హైకమాండ్ గట్టిగానే ప్లాన్ చేస్తోందని నేతలు చెబుతున్నారు. తొలి విడత యాత్రలో దక్షిణం నుంచి ఉత్తరానికి రాహుల్ పాదయాత్ర చేశారు. త్వరలో ప్రారంభం కానున్న రెండో విడతలో పశ్చిమ నుంచి తూర్పు వైపుగా రాహుల్ గాంధీ యాత్ర సాగేలా పార్టీ పెద్దలు రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. సెప్టెంబర్ లో రెండో విడత యాత్ర ఉంటుందని రెండు నెలల కిందటే కాంగ్రెస్ నేతలు చెప్పినా ఇప్పటివరకూ షెడ్యూల్ విడుదల కాలేదు. సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాలపై కాంగ్రెస్ ఎక్కువ ఫోకస్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# సీనియర్లు దరఖాస్తు చేసుకోవాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

సమర్పించాల్సిందేనని హుకూం జారీ చేసింది. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడు అయిన ఎంపీ లక్ష్మణ్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, తదితరులంతా ఈనెల 9, 10 తేదీల్లో దరఖాస్తులు సమర్పించాలని ప్లాన్ చేసుకుంటున్నారు. హైకమాండ్ హుకుం జారీ చేయడంతో మంచి ముహూర్తం కోసమే తాము వేచి చూస్తున్నామని పలువురు కీలక నేతలు చెబుతున్నారు.ఈనెల 7వ తేదీన బీజేపీలో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు 63 మంది 182 అప్లికేషన్లు సమర్పించారు. కాగా రెండో రోజు 178 దరఖాస్తులు వచ్చాయి. అందులో కీలక నేతలెవరివీ లేకపోవడాన్ని అధిష్టానం గుర్తించింది. కొంతమంది నేతలు మూడు, నాలుగు నియోజకవర్గాలకు దరఖాస్తు చేసుకున్నారు. మూడు రోజులు అప్లికేషన్లు భారీగానే వచ్చినా అష్టమి, నవమి కారణంగా 7, 8 తేదీల్లో అప్లికేషన్లు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈనెల 9, 10 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. 9న దశమి, 10వ తేదీన ఏకాదశి ఉన్న నేపథ్యంలో తొలుత వచ్చిన అప్లికేషన్ల కంటే భారీగా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ రెండ్రోజుల్లోనే ముఖ్య నేతలు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అంబర్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్‌కు దరఖాస్తు చేసుకోనున్నారు. ఎంపీ లక్ష్మణ్ ముషీరాబాద్, డీకే అరుణ గద్వాల, ఈటల హుజురాబాద్, అర్వింద్ ఆర్మూర్, రఘునందన్ రావు దుబ్బాక, మాజీ ఎంపీ వివేక్ చెన్నూర్, జితేందర్ రెడ్డి మహబూబ్ నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి దరఖాస్తు చేసుకునే అవకాశాలున్నాయి. కాగా విజయశాంతి, మురళీధర్ రావు, గరికపాటి మోహన్ రావు, చాడ సురేశ్ రెడ్డి, బూర నర్సయ్య గౌడ్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి దరఖాస్తు చేసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉండగా బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జ్ ప్రకాశ్ జవదేకర్.. మూడో రోజు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోని అప్లికేషన్ సెంటర్‌ను పరిశీలించారు. అందరూ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని పార్టీ నేతలకు సూచనలు చేశారు.గతంలో ఎన్నడూ లేనివిధంగా దరఖాస్తు విధానానికి బీజేపీ శ్రీకారం చుట్టింది. కాగా ఆశావహులకు ఈనెల 4వ తేదీ నుంచి ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఈనెల 12వ తేదీన భారత్ కు తిరిగిరానున్నారు. ప్రస్తుతం ఆయన అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆప్టా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సమావేశాలకు ఆయన హాజరవుతున్నారు. ఈనెల 10వ తేదీన ఆయన అమెరికా నుంచి బయలుదేరి ఈనెల 12న భారత్ కు చేరుకుంటారు. ఈనేపథ్యంలో ఆయన దరఖాస్తును వేరొకరు అందజేసే అవకాశముంది.

# హైదరాబాద్‌లో పెరుగుతున్న డెంగీ కేసులు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి ఈ డెంగీ తీవ్రత మరింత ఎక్కువ కావచ్చని తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఓ 30 ఏళ్ల యువకుడు తీవ్ర జ్వరంతో బాధపడుతూ చనిపోయాడు. అయితే అతను డెంగీ లక్షణాలతోనే మృతి చెందినట్లు కుటంబీకులు చెప్పారు. అయితే డెంగీ లక్షణాలు వస్తే మాత్రం వెంటనే అప్రమత్తం కావాలని వైద్యులు చెబుతున్నారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కళ్లు, కండరాలు, కీళ్ల నొప్పులు ఉండటం.. రుచి కోల్పోవడం, జలుబు, వాంతులు వంటివి డెంగీ లక్షణాలని అంటున్నారు.డెంగీ వచ్చిన తర్వాత ఇబ్బంది పడటం కన్నా కూడా దాని గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే దోమలు కుట్టకుండా ఉండేందుకు.. ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. డెంగీని ప్రారంభ దశలోనే గుర్తిస్తే త్వరగా నయం కావడమే కాకుండా తక్కువ ఖర్చుతో బయటపడే అవకాశం ఉందని చెప్పారు. ఒకవేళ ఇది ముదిరితే.. ప్లేట్‌లెట్ల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయి ప్రాణాంతకంగా మారుతుందని చెప్పారు. ఆసుపత్రులకు వెళ్తున్న వారిలో లక్షణాలను బట్టి డెంగీ పరీక్షలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో ప్రధానంగా గిరిజన ప్రాంతాల నుంచి వచ్చేటటువంటి వారిలో ఈ వ్యాధి తీవ్రత మరింత ఎక్కువగా ఉంటోందని వైద్య వర్గాలు పేర్కొన్నాయి. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో చూసుకుంటే అవుట్‌పేషెంట్లతో పాటు ఇన్‌పేషంట్ల సంఖ్య ఎక్కువగా పెరిగిపోయింది. అయితే ఇది ఇటీవలే 25 నుంచి 30 శాతం వరకు ఓపీ పెరిగినట్లు అధికారులు చెప్పారు.

# అతిధి సత్కారాలకు పెద్ద పీట

(మొదటిపేజీ తరువాయి)

ఇందులో పలు దేశాల అధినేతలు పాల్గొననున్నారు. అతిథులకు స్వాగతం పలికేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందులో అతిథుల బస ఏర్పాటు నుంచి రకరకాల వంటకాలు వడ్డించడం వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. భారతీయ సంస్కృతిలో అతిథి దేవో భవ.. అంటే అతిథిని దేవతలా భావించి వారికి ఆతిథ్యం ఇస్తారన్నమాట.. భారతదేశంలో ఆతిథ్యానికి చాలా ప్రాధాన్యత ఇస్తారు. అటువంటి పరిస్థితిలో, ఉ-20 సమ్మిట్‌కు హాజరయ్యే అతిథుల గౌరవానికి తగినట్లు.. ఆతిథ్యం విషయంలో భారత ప్రభుత్వం ఎలాంటి అవకాశ ఎటువంటి అవకాశాన్ని కూడా వదిలిపెట్టడం లేదు..అయితే, జీ20 సదస్సుకు హాజరయ్యే వారికి ఆహారాన్ని అందించే విధానం కూడా చాలా ప్రత్యేకంగా ఉండనుంది. తద్వారా సకల సౌకర్యాలు.. ఆతిథ్యాన్ని స్వీకరించిన అతిథులు ఎన్నటికీ.. ఎప్పటికీ మరచిపోలేని విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విశిష్ట అతిథులందరికీ వెండి పాత్రల్లో భోజనం వడ్డించనున్నారు. భారత్ ఆహారాన్ని వడ్డించే విధానంలో సంస్కృతి, వారసత్వం, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పనుంది. అందుకే అతిథులకు వెండి పాత్రల్లో భోజనం వడ్డించడంతోపాటు.. రకరకాల వంటలను సిద్ధం చేయనున్నారు.అతిథుల కోసం ఏర్పాట్లను సిద్ధం చేయడంపై కళాకారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఒక్కో డిజైన్ వెనుక ఒక్కో ఆలోచన ఉంటుంది. ఇందులో భారతీయత సంప్రదాయం కనిపించేలా ప్రత్యేకంగా తయారు చేశారు. వీటిలో భారత సంస్కృతి సంప్రదాయాలన్నీ కనిపించనున్నాయి. ఈ పాత్రల తయారీలో 200 మంది కళాకారుల శ్రమ ఉంది. కర్నాటక, బెంగాల్, ఉత్తరప్రదేశ్, జైపూర్, ఉత్తరాఖండ్ వంటి వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ఈ పాత్రల తయారీలో పనిచేశారు.ఈ వెండి పాత్రలను జైపూర్ కంపెనీ ఐఆర్ఐఎస్ తయారు చేసింది. హస్తకళాకారులు అహోరాత్రులు కష్టపడి ఈ పాత్రలను తయారు చేశారు. ఈ పాత్రల సెట్ ఫ్యూజన్ సొబగుల థీమ్‌పై రూపొందించారు.అతిథుల కోసం ప్రత్యేకంగా డిన్నర్ సెట్‌ను సిద్ధం చేశారు. ఉప్పు ట్రేలో అశోక చక్ర చిత్రం ఉండడం దీని ప్రత్యేకత. డిన్నర్ సెట్‌లో వెండి వస్తువులు, బంగారు పూత పూసిన గిన్నెలు, సాల్ట్ స్టాండ్, స్పూన్ ఉన్నాయి. గిన్నె, గ్లాస్, ప్లేట్‌కు రాయల్ లుక్ ఇచ్చారు. దీనితో పాటు, ట్రేలు, ప్లేట్లలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు కనిపిస్తాయి. ఫుడ్ ప్లేట్‌లో హస్తకళల అందమైన కళాకృతి కూడా కనిపించనుంది.

**సెక్యూరిటీ చక్రబంధనంలో నయా ఢిల్లీ**

జీ20 సదస్సు నేపథ్యంలో దిల్లీ ఇప్పటికే భద్రతా వలయంలోకి జారుకుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 9,10 తేదీల్లో ఏవి మూతపడి ఉంటాయి. ఏవి ఓపెన్?గా ఉంటాయి? అన్న వివరాలను ఇక్కడ తెలుసుకోండి. జీ20 సదస్సు కోసం దేశ రాజధాని దిల్లీ సన్నద్ధమవుతోంది. ఈ నెల 9, 10 తేదీల్లో జరగనున్న ఈ ముఖ్యమైన ఈవెంట్? కోసం అధికారులు భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. దిల్లీ మొత్తం ఇప్పటికే భద్రతా వలయంలోకి జారుకుంది. ఈ రెండు రోజుల పాటు అనేక సేవలు స్తంభించిపోనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 9,10 తేదీల్లో దిల్లీలో ఏవి ఓపెన్ ఉంటాయి. ఏవీ మూతపడి ఉంటాయి వంటి వివరాలను ఇక్కడ తెలుసుకుందాము..దౌలా కౌన్, ఖాన్ మార్కెట్, జన్‌పథ్, భికాజీ కామా ప్లేస్ వంటి ప్రాంతాలను సున్నితమైన ప్రదేశాలుగా గుర్తించారు. కానీ పూర్తిగా మూసివేయలేదు. ట్రాఫిక్?ను నియంత్రిస్తారు. మార్కెట్‌లను నియంత్రిస్తారు.ఈ నెల 8-10 మధ్యలో ఆన్‌లైన్? ఫుడ్ డెలివరీ సేవలపై నిషేధం ఉంటుంది. క్లౌడ్ కిచెన్ సేవలు నిలిచిపోనున్నాయి. డోర్ డెలివరీ సేవలు కూడా మూతపడే ఉంటాయి. అయితే.. గ్రాసరీ, ఔషధాలు వంటి నిత్యావసర సేవలు ఓపెన్‌గా ఉంటాయి. ఏటీఎంలు ఓపెన్‌గా ఉంటాయి.ఇక మెట్రో సేవల విషయానికొస్తే.. మోతీ బాఘ్, బికాజీ కామా ప్లేస్, మునిర్కా, ఆర్‌కే పురం, ఐఐటీ, సదర్ బజార్ కంటోన్మెంట్ మెట్రో స్టేషన్లు.. 9,10 తేదీల్లో మూతపడి ఉంటాయి. ఖాన్ మార్కెట్‌లోని గేట్ నెం 1,2,3ను క్లోజ్ చేస్తారు. 4వ గేట్ మాత్రం ఓపెన్‌గా ఉంటుంది. మెట్రో సేవల గురించి పూర్తి వివరాల కోసం డీఎంఆర్‌సీ వెబ్?సైట్?ను సందర్శించాల్సి ఉంటుంది.న్యూ దిల్లీ జిల్లాలోని అన్ని థియేటర్లు, రెస్టారెంట్లు మూతపడి ఉంటాయి. అనేక ప్రాంతాల్లో తాత్కాలిక ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి వస్తాయి.ఇక సదస్సు జరిగే న్యు దిల్లీ జిల్లాను 'కంట్రోల్డ్ జోన్-1'గా పరిగణిస్తున్నారు. ఈ ప్రధాన జోన్‌లో వాహనాలు, సైకిళ్లకు అనుమతి లేదు. ప్రజలు ఆ రెండు రోజులు మార్నింగ్ వాక్‌కు వెళ్లకపోవడం బెటర్?.మహాత్మా గాంధీ మార్గ్ రింగ్ రోడ్డును 'రెగ్యులేటెడ్ జోన్'గా పరిగణిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు ఇక్కడ ఆంక్షలు అమల్లో ఉంటాయి. ఔటర రింగ్ రోడ్ (నేషనల్ హైవే 48ని మినహాయించి)లో ఎలాంటి నిబంధనలు లేవు. ఈ దఫా జరుగుతున్న జీ20 సమావేశాన్ని భారత ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పరిగణిస్తోంది. ఈ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో పాటు ఇతర దేశాధినేతలు ఈ సదస్సులో పాల్గొననున్నారు. చైనా అధ్యక్షుడు జిన్?పింగ్? మాత్రం.. ఈ సమావేశానికి దూరంగా ఉంటున్నారు. ఆయన స్థానంలో చైనా ప్రీమియర్ లీ కియాంగ్ ఇండియాకు వస్తున్నారు. ఈ విషయాన్ని బీజింగ్ అధికారికంగా ప్రకటించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా రావట్లేదు.మొత్తం మీద 10వేలకుపైగా మంది దౌత్యాధికారులు ఈ సదస్సుకు హాజరవుతారని సమాచారం. జీ20 సదస్సులో పాల్గొనే దేశాధినేతల కోసం రుచికరమైన వంటలను ప్రభుత్వం సిద్ధం చేస్తోందని సమాచారం. చాంద్నీ చౌక్ నుంచి ప్రత్యేకంగా ఇండియన్ స్ట్రీట్ ఫుడ్‌ను తీసుకొస్తున్నారని తెలుస్తోంది. అంతేకాకుండా.. మిల్లెట్లతో ప్రత్యేక ఆహారాన్ని సిద్ధం చేస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి."దేశాధినేతలకు భారత ఆహారాలను రుచిచూపించాలి. మెన్యూను ఫైనల్ చేసేందుకు షెఫ్‌లు పనిచేస్తున్నారు. స్ట్రీట్ ఫుడ్‌కు దిల్లీ పెట్టింది పేరు. ముఖ్యంగా చాంద్నీ చౌక్ ప్రాంతంలో రుచికరమైన ఫుడ్ లభిస్తుంది. దీని రుచిని చూపించాల్సిందే," అని జీ20 ఇండియా స్పెషల్ సెక్రటరీ ముక్తేశ్ పర్దేశీ తెలిపారు.

# హోంగార్డులకు అండగా వుంటాం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తాం అన్నాడు..ఇంత వరకు చెయ్యలేదని అన్నారు.

8గంటల డ్యూటీ చెయ్యాల్సినదైతే ఎక్కువ టైంతో చేస్తున్నారు. హోంగార్డులకు ఉద్యోగ భద్రత కలిపించాలి, ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించాలి. హెల్త్ పరంగా, అలెవెన్సు , డబల్ బెడ్ రూమ్ హోంగార్డులకు ఇవ్వాలి. సీఎం కేసీఆర్ హామీలు ఇచ్చిన హోంగార్డులకు న్యాయం జరగలేదు. కేసీఆర్ హామీ ఇచ్చి 5న్నార సంవత్సరలు కావొస్తున్న సమస్య పరిష్కారం కాలేదు. హోంగార్డులు రోడ్డున పడుతున్నారు. హోంగార్డులకు సకాలంలో జీతాలు ఇవ్వాలి. రవీందర్ ప్రాణాలు కాపాడడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.. రవీందర్ కుటుంబానికి అండగా ప్రభుత్వం ఉండలి. ప్రాణాలతో రవీందర్ బయటపడలని కోరుకుంటున్న. హోంగార్డు హక్కులను కపడాల్సిన అవసరం ఉంది. పోలీసుల వ్యవస్థలో అవమానకరంగా హోంగార్డులయ్యారు. ఖాకి డ్రెస్ వేసుకున్న హోంగార్డులకు న్యాయం లేదు. .హోంగార్డులు ఎవ్వరు ఆత్మహత్యలు చేసుకోవద్దు. ?? ఆత్మహత్యల ద్వారా సమస్య పరిష్కారం కాదు..హక్కుల కోసం పోరాడాలి. హోంగార్డులాంత శాంతియుతంగా పోరాడుదాం. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక హోంగార్డులకు అండగా ఉంటాం. బిజెపి హోంగార్డు రవీందర్ కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.

# తమిళనాడు గవర్నర్‌గా రజనీకాంత్..?

(మొదటిపేజీ తరువాయి)

వ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్నారు. ప్రస్తుతం 72 ఏళ్ల వయసులోనూ బాక్సాఫీసును షేక్ చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకూ వెండితెర మీద అలరించిన రజనీకి.. ఇప్పుడు నిజ జీవితంలో రాజ్యాంగబద్ధ పదవి దక్కబోతోందని తమిళ నాట జోరుగా ప్రచారమవుతోంది. త్వరలోనే ఆయనకు గవర్నర్ పదవి వరించనుందని టాక్ వినిపిస్తోంది.రజనీకాంత్ ఇటీవల కాలంలో భారతీయ జనతా పార్టీ నేతలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. 'జైలర్' సక్సెస్ తర్వాత ఆధ్యాత్మిక యాత్రకు హిమాలయాలకు వెళ్లిన రజనీ.. తిరుగు ప్రయాణంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో సహా కొందరు రాజకీయ నేతలను కలిశారు. ముఖ్యంగా యోగి ఆదిత్యనాథ్ కాళ్లపై పడి మరీ ఆశీస్సులు తీసుకోవడం చర్చనీయాంశం అయింది. ఈ క్రమంలోనే తమిళనాడులోని పలువురు నేతలతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో రజనీకాంత్ ను బీజేపీ ప్రభుత్వం గవర్నర్ గా నామినేట్ చేయనుందని.. అది కూడా తెలంగాణా రాష్ట్రానికి గవర్నర్ ను చేయనున్నారని వార్తలు వస్తున్నాయి.ప్రస్తుతం తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య ఘర్షణ వాతావరణం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో మంచి పేరున్న రజనీకాంత్‌ను తెలంగాణ గవర్నర్‌గా పంపించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. రజనీకి గవర్నర్ గిరి కట్టబెట్టడం ద్వారా దక్షిణ భారతదేశంలో పార్టీ బలోపేతానికి ఆయన చరిష్మా కలిసి వస్తుందని అగ్రనాయకత్వం భావిస్తోందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.ఇదే విషయాన్ని రజనీకాంత్ సోదరుడు సత్యనారాయణరావు దగ్గర ప్రస్తావించగా, రజనీ రాజకీయాల్లోకి రారని చెప్పారు. రజనీకి గవర్నర్ పదవి రావాలని ఎలాంటి ఆశలు పెట్టుకోలేదనీ, ఒకవేళ వస్తే మాత్రం సంతోషిస్తామని అన్నారు. రజనీ సైతం గవర్నర్ పదవిని తిరస్కరించరని అన్నారు. సూపర్ స్టార్ ఇటీవల పలువురు బీజేపీ రాజకీయ నేతలను కలవడం, ఆయన సోదరుడి వ్యాఖ్యలు రజనీకి గవర్నర్ గిరి అనే ప్రచారానికి మరింత బలం చేకూరుస్తున్నాయి. బీజేపీ హయాంలోనే రజనీకాంత్ కు భారతీయ సినీ రంగంలో ఇచ్చే అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ దక్కిందనే విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు.నిజానికి రజనీకాంత్ గతంలోనే పార్టీ స్థాపించి రాజకీయాల్లోకి రావాలని ప్లాన్ చేసుకున్నారు. అభిమానులతో కూడా సమావేశాలు నిర్వహించి చివరకు ఉసూరమనిపించారు. తన ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రాజకీయాల్లోకి రావడం లేదని.. ఎన్నికల్లో పోటీ చేసేది లేదని ప్రకటించారు. పాలిటిక్స్ లోకి రాకుండానే ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. ఇన్నాళ్లకు మళ్లీ తలైవా పొలిటికల్ కెరీర్‌పై మరోసారి ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈసారి గవర్నర్ పదవి దక్కనుందిని అంటున్నారు. మరి రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో వేచి చూడాలి.

# 4 లక్షల ఉచిత విగ్రహాలు

(మొదటిపేజీ తరువాయి)

షిఫ్టుల్లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కోసం ఆయా శాఖల అధికారులతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్ రోస్ బుధవారం రోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హెచ్ఎండీఏ పరిధిలో లక్ష, జీహెచ్ఎంసీ పరిధిలో 3 లక్షల మట్టి గణపతులను కార్పొరేటర్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు మేయర్ వెల్లడించారు. అన్ని విభాగాల అధికారులతో పాటు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో మేయర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు సూచించిన అన్ని అంశాలనను పరిగణనలోకి తీసుకుని ఏర్పాట్లు చేస్తామని మేయర్ తెలిపారు. రోడ్లపై బారికేడ్లు, శానిటేషన్, పబ్లిక్ టాయిలెట్లు, మొబైల్ ట్రీ కటింగ్, ఆరోగ్య శిబిరాలు, బోట్లు, స్విమ్మర్లు, నిరంతర విద్యుత్ సరఫరా, స్ట్రీట్ లైట్లు, పాట్ హోల్స్, తాగునీటి సరఫరా, అగ్నిమాపక యంత్రాలు తదితర ఏర్పాట్లు చేయనున్నట్లు మేయర్ వెల్లడించారు. వినాయక చవితిని నగరవాసులు ఘనంగా జరుపుకునేలా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డి తెలిపారు. జీహెచ్ఎంసీ వివిధ శాఖల సమన్వయంతో వ్యవహరించి, భక్తులకు పలు సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పుకొచ్చారు. మొదటి రోజు, చివరి రోజు గణనాథుల ఊరేగింపు సందర్భంగా స్వచ్ఛంద సంస్థలు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినాయక చవితిని నగరవాసులు ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి సమస్యలు లేకుండా అట్టహాసంగా చేసుకునేలా అన్ని చర్యలు చేపట్టనున్నట్లు కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.నిమజ్జనం సందర్భంగా హెచ్ఎండీఏ ద్వారా ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్ లో 7 ప్లాట్‌ఫామ్‌లు, ట్యాంక్‌బండ్ వద్ద 14 ప్లాట్‌ఫామ్‌లు, పీపుల్స్ ప్లాజా వద్ద 8 క్రేన్లు, బుద్ధ భవన్ వైపు 7 ప్లాట్‌ఫామ్‌లు, హెలిప్యాడ్, సంజీవయ్య పార్కు వద్ద బేబీ పాండ్, అక్కడ కూడా క్రేన్లు ఏర్పాటు చేయనున్నారు. మ్యాన్ హోల్స్ మరమ్మతులు, తాగునీటి సరఫరా, అవసరమైన నీటి ప్యాకెట్లు, వాటర్ క్యాన్ల సరఫరా, ట్యాంకుల ద్వారా నీటి సరఫరా వంటి ప్రక్రియ జలమండలి చేపట్టనుంది. ప్రతిమల నిమజ్జనం కోసం నగరంలో 74 కొలనులను ఏర్పాటు చేయనుంది.

# సంపాదకీయం

## కొత్త పార్లమెంట్ లో కీలక బిల్లులు

సెప్టెంబర్ 18 నుంచి 22 వరకూ ఐదు రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు పిలుపునిచ్చింది కేంద్ర ప్రభుత్వం. పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు ఒకే దేశం, ఒకే ఎన్నిక పైనా చర్చ జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే దీనిపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఓ కమిటీ ఏర్పాటైంది. అయితే...ఈ ప్రత్యేక సమావేశాలు పాత పార్లమెంట్ బిల్డింగ్‌లో జరుగుతాయా..? లేదంటో కొత్త భవనంలో నిర్వహిస్తారా అన్న అనుమానాలు తలెత్తాయి. ఈ విషయంలో కేంద్రం క్లారిటీ ఇచ్చింది. సెప్టెంబర్ 18న అంటే...తొలి రోజు సమావేశాలు పాత బిల్డింగ్‌లోనే జరుగుతాయని స్పష్టం చేసింది. ఆ తరవాత సెప్టెంబర్ 19న వినాయక చవితి సందర్భంగా కొత్త బిల్డింగ్‌లోకి షిఫ్ట్ అవుతున్నట్టు వెల్లడించింది. అంటే...సెప్టెంబర్ 19-23 వరకూ కొత్త పార్లమెంట్ భవనంలోనే ప్రత్యేక సమావేశాలు జరుగుతాయి. ఈ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్‌ని ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. అయితే...ఇప్పటి వరకూ ఈ సమావేశాల అజెండా ఏంటన్నది స్పష్టంగా చెప్పలేదు కేంద్ర ప్రభుత్వం. ఈ విషయమై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషిని ప్రశ్నించగా...త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. జూన్1వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా కొత్త పార్లమెంట్ బిల్డింగ్‌ని ప్రారంభించారు. మోదీతో పాటు లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇందులోనే సెన్గోల్ని ఏర్పాటు చేశారు. ప్రశ్నోత్తరాల సమయం, ప్రైవేట్ కార్యకలాపాలు ఉండవని లోక్‌సభ, రాజ్యసభ సెక్రటేరియట్‌ల నుంచి ఇటీవలే అధికారిక నోటిఫికేషన్ వెలువడింది. సెషన్‌లో ఐదు సిట్టింగ్‌లు ఉంటాయి. సభ్యులు విడిగా తాత్కాలిక క్యాలెండర్‌ని అందుకుంటారు. సెప్టెంబర్ 18 నుంచి 17వ లోక్‌సభ పదమూడో సమావేశాలు ప్రారంభమవుతాయని సూచిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ బులెటిన్ విడుదల చేసింది. సెప్టెంబర్ 18న సమావేశాలు ప్రారంభమవుతాయని, ఈ మేరకు సభ్యులకు సమాచారం ఇస్తున్నట్లు బులిటెన్‌లో పేర్కొంది. జమిలీ ఎన్నికలపై చర్చ జరుగుతున్న సమయంలో ఈ సమావేశాలపై ప్రకటన రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజ్యసభ రెండు వందల అరవై ఒకటో సెషన్ సెప్టెంబర్ 18వ తేదీన ప్రారంభమవుతుందని, ఈ మేరకు సభ్యులకు తెలియజేస్తున్నట్లు రాజ్యసభ సెక్రటేరియట్ తెలిపింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి సెప్టెంబర్ 18 నుంచి ఐదు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అయితే సమావేశాల అజెండాను రహస్యంగా ఉంచారు. దీంతో పలు ఊహాగానాలు వస్తున్నాయి.మరో వైపు దేశం పేరును ఇండియా నుంచి భారత్ గా మార్చుతారనే ప్రచారం వేళ ఇండియా కూటమి నేతలు అత్యవసరంగా సమావేశమైంది.. సెప్టెంబర్ 18వ తేదీ నుంచి మొదలయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల అజెండా ఏంటి అని అడగటంతో పాటు వివిధ సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ లేఖ రాయనున్నట్లు తెలుస్తోంది. 24 పార్టీల ప్రతిపక్ష కూటమి ఇండియా తరపున మరికొన్ని రోజుల్లో లేఖ రాస్తారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. దేశం పేరు మార్చనున్నారన్న వేళ ఇండియా కూటమి అత్యవసరంగా సమావేశమైంది. కాంగ్రెస్ పార్లమెంటరీ లీడర్లు సోనియా గాంధీ నివాసంలో సమావేశం అయ్యారు. అనంతరం ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే నివాసంలో ఇండియా కూటమికి చెందిన నేతలు భేటీ అయ్యారు. ఇండియా అనే పేరును రాజ్యాంగం నుంచి తొలగించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు కూటమి నేతలు మూకుమ్మడిగా చెప్పినట్లు సమాచారం. సెప్టెంబర్ 18 నుంచి 22 వరకు ఐదు రోజుల పాటు జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను బహిష్కరించాలని కొన్ని చిన్న పార్టీలు సూచించగా అయితే పెద్ద పార్టీలు మాత్రే ఆ సూచనలను తిరస్కరించినట్లు తెలుస్తోంది. సానుకూల అజెండాతో ప్రత్యేక సమావేశాలకు రావాలని నిర్ణయించుకున్నట్లు ఓ పార్టీ నాయకుడు తెలిపారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఎందుకు పెడుతున్నారో కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టత లేదని, ఈ ప్రత్యేక సెషన్ ప్రత్యేకత ఏమిటో దేశానికి తెలియదని, బీజేపీ అజెండా ఏమిటో దేశానికి చెప్పాలని కూటమి నాయకుడు ఒకరు డిమాండ్ చేశారు. అయితే ఈ ప్రత్యేక సమావేశాల్లో కూటమి పక్షాలు ఏకాభిప్రాయంతో చర్చించేలా మల్లిఖార్జున్ ఖర్గే కొన్ని అంశాలను ప్రకటించారు. అదానీ గ్రూప్ పై తాజా ఆరోపణలు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, మణిపూర్ లో హింసాత్మక పరిస్థితి, కాగ్ రిపోర్టు, అధిక కనీస మద్దతు ధర డిమాండ్, ఫెడరల్ ఏజెన్సీల దుర్వినియోగంపై చర్చించాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాలనని 28 పార్టీల నాయకులు నిర్ణయించినట్లు సమాచారం. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం 'ఇండియా' కూటమిగా ఏర్పడ్డ విపక్షాలకు మోకాలడ్డిన చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్పందిస్తూ.. 'ఇండియా' కూటమి పేరు సమస్యగా ఉన్నందున 'భారత్'గా మార్చుకుంటే, మరి 'భారత్' స్థానంలో భారతీయ జనతా పార్టీ మరేదైనా పేరు పెట్టుకుంటుందా? అని ప్రశ్నించారు.దేశం 140 కోట్ల మంది ప్రజలది, కేవలం ఒక పార్టీది కాదు అంటూ మండిపడ్డారు. అలాగే ఇంకా ఆసక్తికర వ్యాఖ్యలు కూడా చేశారు. ఒక వేళ విపక్ష కూటమి పేరును ఇండియా నుంచి భారత్ అని మార్చితే అప్పుడు ఏం చేస్తారంటూ ప్రశ్నించారు. తాము కూటమి పేరును భారత్‌గా మారిస్తే మీరు దేశం పేరును బీజేపీగా మారుస్తారా అంటూ అడిగారు.

# 9న మెగా అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్

జగిత్యాల - ప్రభాత సూర్యుడు



ఈనెల 9వ తేదిన జరగబోయే జాతీయ మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ సూచించారు. ఈ నెల 9 న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడ దగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులో, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు, ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని జిల్లా ఎస్పీ వెల్లడించారు. రాజీ మార్గం రాజ మార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని డబ్బులను వృధా చేసుకోవద్దని, జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పోలీస్ అధికారులు కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్, పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

# నిరుపేద ప్రజలకు అండగా సీఎం కేసీఆర్

నిర్మల్- ప్రభాత సూర్యుడు

అసెంబ్లీ ఎన్నికల వేళ ఇతర పార్టీలకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరుతున్నారు. నిర్మల్ రూరల్ మండలం న్యూ పోచంపహాడ్ గ్రామానికి చెందిన 40 మంది, దిలావర్ పూర్ మండలానికి చెందిన 30 మంది, నర్సాపూర్ మండలానికి చెందిన 30 మంది, లక్ష్మణచాంద మండలం కనకాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ ను వీడి గులాబీ గూటికి చేరారు. అదేవిధంగా అంబేద్కర్ యువజన సంఘాలకు చెందిన పలువురు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వీరికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ... నిరుపేద ప్రజలకు అండగా సీఎం కేసీఆర్ సారథ్యంలో అద్భుతమైన పథకాలు అమలుచేస్తున్నారని, దళితబంధు, బీసీ బంధు, మైనార్టీలకు ఆర్థిక సహాయం రైతు రుణమాఫీ తో ఇతర పార్టీలకు చెందిన వారు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ శ్రేణుల్లో కూడా మరింత జోష్ పెరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజాసంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతరపార్టీల నుంచి నేతలు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీ వైపు పరుగులు పెడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి పార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యాన్ని కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతిపక్ష నాయకులు పభుత్వ పథకాలు, సంక్షేమం చూసి తట్టుకోలేక అధికార పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ప్రజలు వాస్తవ పరిస్థితులను గమనిస్తున్నారని, మోసపూరిత నాయకుల మాటలు వినే పరిస్థితుల్లో ప్రజలు లేరని వివరించారు. కలిసికట్టుగా పార్టీ కోసం కృషిచేసి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని గెలిపించుకుని హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తామని పార్టీలో చేరిన సందర్భంగా పలువురు వ్యాఖ్యానించారు. నిర్మల్ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆద్వర్యంలో తమ గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో తాము మంత్రికి మద్దతుగా బీఆర్ఎస్ పార్టీలో చేరామని తెలిపారు.

## కమలం గూటికి ఆరేపల్లి...

కరీంనగర్- ప్రభాత సూర్యుడు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. రేపు భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తారని తెలుస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే పలవురు బీఆర్ఎస్ నాయకులు పార్టీని వీడగా తాజాగా మరో సీనియర్ నేత ఆరెపల్లి మోహన్ కారు దిగి కమలం గూటికి చేరనున్నారు. జడ్పీటీసీ, జడ్పీ ఛైర్మెన్, కాంగ్రెస్ ఎమ్మెల్యేగా, దివంగత ఎమ్మెస్సార్ ప్రియ శిష్యుడిగా పేరుతెచ్చుకున్న ఆరెపల్లి మోహన్ గతంలో కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ లో చేరారు. దళితులకు పెద్దపీట అన్న కేసీఆర్ మాటలు నమ్మి పార్టీ మారినట్లు ఆరెపల్లి చెప్పారు. అయితే అప్పటి నుంచే ఆరెపల్లికి అసలు చిక్కులు ఆరంభమయ్యాయి. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న ఆరెపల్లికి బీఆర్ఎస్ పార్టీలో సముచిత స్థానం దక్కలేదు. మానకొండూరు నియోజకవర్గానికి లేకుంటే చొప్పదండి ఏదో ఒక నియోజ కవర్గం నుంచి తనకు సీటు ఖరారు అవుతుందని భావించిన ఆరెపల్లికి నిరాశే ఎదురైంది. ఇటీవల కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో తన పేరు లేకపోవడంతో మనస్థాపానికి గురైన ఆరెపల్లి తన ఆనుచరులతో సమావేశ మయ్యారు. కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణపై గతంలో రెండు సార్లు పోటీచేసి ఓడిపోవడంతో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లినా సీటు గ్యారంటీ లేదని భావించి ఆరెపల్లి బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది.

# ఖండాంతరాలు దాటనున్న పుట్టపాక చేనేత కళాకారుల ఖ్యాతి

(మొదటి పేజీ తరువాయి)

శీతాకాలం వేడిగా, ఎండాకాలం చల్లగా ఉండే రుమాలు.. మండుటెండల్లో సైతం చల్లగా, శీతా కాలంలో వెచ్చగా ఉండే తేలియా రుమాలు తయారీ చాలా ప్రత్యేకమైనది. ఈ రుమాలులో వాడే రంగులన్నీ ప్రకృతి సిద్ధంగా లభించేవే. ఆముదపు పొట్టును కాల్చినప్పుడు వచ్చే బూడిదను, వృక్ష సంబంధ రంగులతోపాటు ఆముదం లేదా నువ్వుల నూనెను సూర్యరశ్మి ద్వారా వేడైన నీటిలో కలిపి నూలును అందులో నానబెడుతారు. అలా నానబెట్టిన నూలును కనీసం 20రోజులపాటు రోజుకు రెండు పూటలా చేతులతో పిసుకుతారు. తరువాత నూలును పిండి ఆరబెడతారు. ఆరిన తరువాత మళ్లీ నీటిలో నానబెడతారు. ఇలా 20రోజులపాటు చేయడం ద్వారా దారాల్లోకి నూనె ఇంకి రంగులు చక్కగా అంటుకుంటాయి. పటిక, కరక్కాయ, హీరాకాసు తో ఎరుపు, నీలం, పసుపు మొదలైన రంగులన్నీ చెట్ల నుంచి తయారు చేస్తారు. నూనెలు, సహజసిద్ధ రంగులు వాడడం మూలంగా తేలియా రుమాలుకు ఔషధ గుణాలు అందుతాయి కాబట్టే వేసవి తాపం తప్పించి చల్లదనాన్ని అందిస్తుంది. ఉష్ణోగ్రత అధికంగా ఉండే గల్ఫ్ ప్రాంతాల్లో ఉండేవారు ప్రత్యేకంగా తేలియా రుమాలును కొనుగోలు చేస్తుం టారు. ఈ రుమాలు డిజైన్లను బట్టి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఖరీదు ఉంటుంది. పుట్టపాక తేలియా రుమాలు ఇక్కడి నుంచి ముంబాయి, జర్మనీ, జపాన్, సింగపూర్, అమెరికా, నెదర్లాండ్, గుజరాత్, చెన్నై, సోలాపూర్, కోల్‌కతా, అతరబ్ దేశాలకు ఎగుమతి అవుతుంటాయి.

**దుబీయన్ వస్త్రం పుట్టపాక సొంతం..**

దుబీయన్ వస్త్రం డిజైన్ పుట్టపాక చేనేత కళాకారుల సొంతం. ప్రపంచ వ్యాప్తంగా దుబీయన్ వస్త్రం డిజైన్ ఎక్కడ కూడా కనిపించదు. పుట్టపాక చేనేత కళా కారులు మాత్రమే ఈ వస్త్రం డిజైన్ చేస్తారు. ఈ వస్త్రం తయారీలో నిలువు ఇక్కత్ విధానం పాటిస్తారు. అలాగే డిజైన్ నిలువు ఇక్కత్‌లోనే రూపొం దిస్తారు. ఈ వస్త్రం తయారీలో వాడే దారాలు పలుచగా ఉంటాయి. ఈ వస్త్రంతో ప్యాబ్రిక్ దుస్తులు తయారు చేస్తారు. ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ఆ దేశ అధ్యక్షుడి భార్య బ్రిగిట్టే మెక్రాన్‌కు దుబీయన్ చీరెను బహూకరించ దంతో పుట్టపాక ఖ్యాతి ఖండాంతరాలకు చేరింది.

# గోవా కర్రలు విగిరి
# ఇద్దరు కూలీలు మృతి

### మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

రంగారెడ్డి- ప్రభాత సూర్యుడు

కెపిహెచ్బి పోలీస్ స్టేషన్ పరిధిలోని అడ్డగుట్ట సొసైటీ కాలనీలో విషాద ఘటన జరిగింది. నిర్మాణంలో ఉన్న ఓ భవనం పైనుంచి నలుగురు కార్మికులు ప్రమాదవశాత్తు కింద పడ్డారు. వారిలో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను దగ్గర్లో ఉన్న ప్రతిమ హాస్పిటల్ లో కు తరలించారు. భవనం లోని ఆరవ అంతస్తులు పిట్టగోడ నిర్మాణ పనులు కొనసాగుతుండగా ప్రమాదం జరిగింది. పిట్టగోడతోపాటు గోవా కరలు కూడా విరిగి కార్మికులు కింద పడిపోయారు. మృతి చెందిన కార్మికులు, గాయపడ్డ కార్మికుల వివరాలు తెలియాల్సి ఉంది.

# కాంగ్రెస్‌లో టికెట్ల కోసం కుస్తీ

(మొదటి పేజీ తరువాయి)

స్కానింగ్ చేస్తునే ఉంది. అప్లికేషన్ల ప్రక్రియే పెద్ద ప్రసహనంలా సాగితే, ఆ దరఖాస్తుల వడపోత, రేసుగుర్రాల ఎంపికపై సుదీర్ఘంగా కసరత్తు కొనసా గుతునే ఉంది. సీనియర్లు, డీసీసీ అధ్యక్షులతో సమావేశమైన స్క్రీనింగ్ కమిటీ? తుది నిర్ణయం తీసుకునేందుకు మరో దఫా సమావేశం కావాలని నిర్ణయించింది. ఇదే సమయంలో.. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరోసారి అలిగారు. సీడబ్ల్యూసీతోపాటు ముఖ్య కమిటీల్లో చోటు దక్కలేదని అలక బూనారు. అభ్యర్థుల ఎంపికపై గత కొన్ని రోజులుగా తెలంగాణ కాంగ్రెస్ చేస్తున్న కసరత్తు ఒక కొలిక్కి వచ్చినట్టు కనిపిస్తోంది. హైదరాబాద్‌లో జరిగిన స్క్రీనింగ్ కమిటీ సమావేశం అన్ని వర్గాల అభిప్రాయాలు సేకరించింది. డీసీసీ అధ్యక్షులు, సీనియర్ నేతలతో స్క్రీనింగ్ కమిటీ సమావేశమైంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఐఅ వేణుగోపాల్‌తో చర్చించిన తర్వాత కమిటీ మరోసారి సమావేశమై అభ్యర్థుల జాబితాను ప్రకటించే సూచనలు కనిపిస్తు న్నాయి. సీడబ్ల్యూసీ సమావేశం ఏర్పాట్లను పరిశీలిం చేందుకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి హైదరాబాద్ చేరుకున్నారు.మరో వైపు కమిటీల్లో స్థానం కల్పించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డిని సీనియర్లు బుజ్జగించారు. కోమటిరెడ్డి నివాసానికి మాణిక్‌రావ్ ఠాక్రే, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ంఎఅఅ కార్యదర్శి సంపత్ వచ్చారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఐఅ వేణుగోపాల్‌తో ఫోన్‌లో మాట్లాడిం చినట్టు తెలుస్తోంది. పదవుల విషయంలో నిరాశకు గురి కావద్దని నచ్చజెప్పారు. కోమటిరెడ్డి అలక, బుజ్జి గింపుల గురించి అడిగిన ప్రశ్నలకు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే సమా ధానం ఇవ్వలేదు. బ్రేక్‌ఫాస్ట్‌కు కోమటిరెడ్డి పిలిచారని, కాంగ్రెస్‌ను కోమటిరెడ్డిని విడదీయలేమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. కోమటిరెడ్డి అలకపై భట్టి నేరుగా స్పందించలేదు. పరిశీలకురాలు దీపను సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కలిశారు. ఎంపిక, టికెట్ల కేటాయింపు విషయంలో పీసీసీ మాజీ అధ్యక్షుల సలహాలు తీసుకోవాలని సూచించారు. అంతే కాదు పొన్నాల లక్ష్మయ్య సహ మాజీ పీసీసీ చీఫ్‌లకు వచ్చే ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలని కోరినట్టు తెలుస్తోంది.

# కేసిఆర్ వల్లే రాష్ట్రంలో జనరంజక పాలన

## మంచి చేసిన కేసిఆర్ కు ప్రజలు మద్దతుగా నిలవాలి - మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



వేల్పూర్- ప్రభాత సూర్యుడు

ముఖ్యమంత్రి కేసిఆర్ జనరంజకపాలన, సంక్షేమ పథకాలు, బాల్కొండ నియోజక వర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బాల్కొండ మండలం జలాల్ పూర్ , వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామాల నుండి కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన సుమారు 150 మంది గురువారం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ... అంక్సాపూర్, జలాల్ పూర్ గ్రామాల నుండి ఇంత పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పార్టీలో చేరి కేసిఆర్ గారికి,తనకు మద్దతు తెలిపేందుకు వచ్చినా ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు అని మంత్రి అన్నారు. ఇక నుండి మీరు బిఆర్ఎస్ కుటుంబ సభ్యులనీ మీకు ఎల్ల వేళలా అండగా ఉంటానని మంత్రి వారికి భరోసా కల్పించారు.బాల్కొండ నియోజకవర్గ ప్రజలే నా కుటుంబ సభ్యులుగా భావించి గత 9 ఏళ్లుగా వేల కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నానని అన్నారు. ఒక్క జలాల్ పూర్ లోనే కోటి రూపాయలు రోడ్లు వేసుకున్నామని అన్నారు. నియోజకవర్గ స్థాయి కుల సంఘ భవనాలకు 100 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఇదంతా ఊరికే జరగలేదని తన తండ్రి దివంగత వేముల సురేందర్ రెడ్డి,తాను 2001 నుండి ఉద్యమ నేత కేసిఆర్ వెంట నడిచామని,మా కుటుంబం 24 సంవత్సరాల నుండి ఒకే పార్టీ, ఒకే నాయకుని కోసం పని చేశామని చెప్పారు. పార్టీ ఏ పని చెప్తే ఆ పని చేస్తామని ఉద్యమం నుండి ఇప్పటి వరకు 24 ఏళ్లలో పార్టీ అధినేత చెప్పిన ఏ పని కూడా నాతో కాదు అని అనలేదన్నారు. కేసిఆర్ గారు చెప్పిన ఏ పని అయినా చేస్తా కాబట్టే తనపై ప్రేమ అని, ఆ ప్రేమతో నియోజకవర్గ అభివృద్ధి చేసుకుంటున్న తప్పా, ఇప్పటివరకు తన సొంత పని ఏమీ చేసుకోలేదనీ తెలిపారు. నియోజక వర్గంలో 22 చెక్ డ్యాంలు, పునరుజ్జీవ పథకం,లిఫ్ట్ లు,వేల కోట్లతో రోడ్లు పలు అభివృద్ధి పనులు చేసుకున్నామని కండ్ల ముందు అంతా కనిపిస్తుందని అన్నారు.

నేను పడే కష్టం నా నియోజకవర్గ ప్రజల కోసమే అని ప్రజలు ఆలోచన చేయాలనీ కోరారు. నాకు ఎంత ప్రజా మద్దతు లభిస్తే అంతా ఎక్కువ ఉత్సాహంతో అభివృద్ధి చేస్తానని,నా మీద చూపించే ప్రేమ మీకు లాభమే అయితది తప్పా..ఏ మాత్రం నష్టం జరగదని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల వేళ చాలా మంది వచ్చి చాలా రకాల మాటలు చెప్తారు అందుబాటులో ఉన్నది ఎవరు కష్ట సుఖాల్లో పాల్పంచుకున్నది ఎవరు, అభివృద్ధి చేసింది ఎవరు అనేది అలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. నేడు కేసిఆర్ వల్లే తెలంగాణ రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని, కేసిఆర్‌కి తనకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

## కామ్రేడ్ రావి నారాయణ రెడ్డి సేవలు చిరస్మరణీయం



అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు : తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, మాజీ పార్లమెంటు సభ్యులు కామ్రేడ్ రావి నారాయణ రెడ్డి సేవలు మరువలేనివని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. సిపిఐ పార్టీ అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో కుంట్లూరు రావి నారాయణ రెడ్డి కాలనీ పేస్ 3 లో కామ్రేడ్ రావి నారాయణ రెడ్డి 33వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డిలు రావి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భూస్వామి పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా దున్నే వాడికే భూమి దక్కాలని, వెట్టిచాకిరి, బానిసత్వం నిర్మూలించాలని నిజాం సర్కార్ కు వ్యతిరేకంగా లక్షలాది మంది ప్రజలను రైతు కూలీలను చైతన్య పరిచి తిరుగుబాటు చేసిన యోధుడని, వేలాది ఎకరాల సాగు భూమిని దానం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన స్ఫూర్తితోనే భూ పోరాటాలను చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ హరిసింగ్, భూ పోరాట కమిటీ సభ్యులు యేశాల నర్సింహా, పొన్నాల యాదగిరి, కేతరాజు నర్సింహా, దాసరి ప్రసాద్, సైదులు ముదిరాజ్, రామావత్ సకృ నాయక్, నవనీత, అరుణ, నారాయణ రెడ్డి, సుజాత, సుభద్ర, దేవమ్మ, చందన, యాదగిరి, మధు, శ్రీకాంత్, రాఘవేంద్ర, వినోద్, శోభన్ మరియు గుడిసెలు వేసుకున్న కాలనీ వాసులు పాల్గొన్నారు.

## టార్గెట్ దిశగా దూసుకెళ్తోన్న ఆదిత్య-ఎల్1

### సెల్ఫీ తీసుకున్న ఆదిత్య-ఎల్1.. వీడియో షేర్ చేసిన ఇస్రో



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: సూర్యుడి అధ్యయనం కోసం చేపట్టిన ఆదిత్య–ఎల్1టార్గెట్ దిశగా దూసుకెళ్తోంది. అయితే ఆగస్టు 4వ తేదీన ఆదిత్య సెల్ఫీ తీసుకున్నది. ఆ ఫోటోను ఇవాళ ఇస్రో షేర్ చేసింది. తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో ఆ పిక్‌కు చెందిన వీడియోను పోస్టు చేసింది. ఆదిత్య ఎల్1కు ఉన్న కెమెరాకు.. వీఈఎల్‌సీ, ఎస్‌యూఐటీ పరికరాలు ఆ ఫోటోలో స్పష్టంగా కనిపించాయి. ఇక ఆదిత్య కెమెరాలకు భూమి, చంద్రుడు కూడా చిక్కాయి. ఆ ఫోటోలను కూడా ఆగస్టు 4వ తేదీన ఆదిత్య తీసింది. సెల్ఫీతో పాటు భూమి, చంద్రుడు ఉన్న వీడియోను ఇస్రో ట్వీట్ చేసింది. 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్1 పాయింట్ వద్దకు ఆదిత్య వెళ్తున్న విషయం తెలిసిందే.

## ఉదయనిధికు వ్యతిరేకంగా బీజేపీ నిరసన ర్యాలీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: సనాతన ధర్మంపై మంత్రి ఉదయ్ నిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు వెనుక తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్ గణేష్ వద్ద బిజెపి ఖైరతాబాద్ నాయకుడు వల్లెపు గోవర్ధన్ ఆధ్వర్యంలో స్టాలిన్ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ర్యాలీగా ఖైరతాబాద్ బడా గణేష్ వద్దకు బయలుదేరిన బిజెపి నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, బిజెపి నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ... తక్షణమే ఉదయ స్టాలిన్ హిందువులకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో హిందూ ధర్మం స్టాలిన్ కి తగ్గిన రీతిలో గుణపాఠం చెప్తుందని హెచ్చరించారు.

## స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి



జగిత్యాల- ప్రభాత సూర్యుడు : తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు చెల్లించాల్సిన 5 వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు..ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యా రంగంలో డిగ్రీ ,పీజీ ,ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ తదితర ఉన్నత విద్యలను అభ్యసించే విద్యార్థులకు గత రెండు సంవత్సరాలుగా చెల్లించాల్సిన 5 వేల కోట్ల రూపాయల ఫీజు రియాంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థుల భవితవ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.. బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి చింతల గంగాధర్, సహ కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కొక్కు గంగాధర్, బి.సి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు తిరుపురం రాంచందర్, బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీకూరి శ్రీహరి, జిల్లా బి.సి విద్యార్థి సంఘం అధ్యక్షులు జాజాల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్ సామ్రాట్, బి.సి సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

## దళితబందుపై ప్రతిపక్షాల నీచ రాజకీయం

జగిత్యాల - ప్రభాత సూర్యుడు

రాబోయే ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి ఓట్లడిగే మొఖం లేకనే ప్రతిపక్ష బిజెపి, కాంగ్రెస్ నాయకులు దళితబందు పథకాన్ని అడ్డుపెట్టుకొని అసత్య ఆరోపణలు చేస్తున్నారని దమ్ముంటే నిరూపించాలని జగిత్యాల జడ్పి వైస్ ఛైర్మన్ హరిచరణ్ రావు అన్నారు. గురువారం మెడిపెల్లి మండలంలోని దేశాయ్ పేటలోని స్పైస్ యూనిట్ వద్ద ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో హరిచరణ్ రావు మాట్లాడారు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత జాతి ఆర్థికాభివృద్ధికై దళిత బంధు పథకాన్ని చేపట్టిం దన్నారు. ఇందులో భాగంగా మెడిపెల్లి మండలానికి 15 యూనిట్లు రాగా అందులోని దేశాయి పేటలోని ఐదు యూనిట్లను కలిపి స్పైస్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దళితబందు ఐదుగురు లబ్ధిదా రులను కలిపి ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్ లో అవినీతి జరిగిందని ప్రతిపక్ష పార్టీలైన బిజెపి, కాంగ్రెస్ పార్టీలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నా యన్నారు. ఈ యూనిట్లో భాగంగా మిషనరీ, భారీషెడ్డు నిర్మాణానికి ఇతరత్రా కలిపి 29 లక్షలు ఖర్చయ్యాయన్నారు. ఇందులోని ప్రతిపైసా లెక్కలు చూపించేందుకు మేము సిద్ధమని అవినీతిని నిరూ పిస్తారా అని ప్రతిపక్ష పార్టీలను హరిచరణ్ రావు నిలదీశారు. ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బిజెపి పార్టీలు ప్రజలకు చేసిందేమిలేదని రాబోయే ఎన్నికల్లో ప్రజల వద్ద ఓట్లు అడిగే మొఖంలేక అధికారపార్టీపై బురదచల్లే నీచ రాజకీయాలకు దిగరన్నారు. దళిత బందులో అవినీతిని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని హరిచరణ్ రావు అన్నారు. ప్రభుత్వ పథకాలపై నిర్మాణాత్మక సలహాలు, సూచ నలు చేయాలని అనవసర, అసత్య ఆరోపణలను మానుకోవాలని జగిత్యాల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

## చివరకు చిక్కిన ఐదో చిరుత



తిరుమల- ప్రభాత సూర్యుడు: తిరుమలలో మరో చిరుత బోనుకు చిక్కింది.. వన్య మృగాల సంచారం నేపథ్యంలో ఆపరేషన్ చిరుతను అటవీ శాఖ అధికారులు కొనసాగిస్తున్నారు.. అలిపిరి కాలిబాట మార్గంలో ట్రాప్ కెమెరాల ద్వారా వన్యమృగాల కదలికలను గుర్తించిన టిటిడి అటవీశాఖ అధికారులు రెండు నెలల వ్యవధిలో ఐదు చిరుతలను బంధించారు.. రాత్రి 12 గంటల ప్రాంతంలో చిరుత బోనుకు చిక్కింది.. దీంతో టిటిడి అటవీ శాఖా అధికారులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని చిరుతను ఎస్వీ జూపార్క్ కు తరలించి శాంపుల్స్ సేకరిస్తున్నారు.. చిరుత బోనుకు చిక్కిందని విషయం తెలుసుకున్న టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సంఘట స్థలం వద్దకు చేరుకుని పరిశీలిం చారు.. అనంతరం టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అలిపిరి కాలిబాట మార్గంలోని ఏడవ మైలు వద్ద రాత్రి 12 గంటల ప్రాంతంలో మరో చిరుత బోనుకు చికిందని, రెండు నెలల వ్యవధిలో ఇప్పటి వరకు ఐదు చిరుతలను బంధించడం జరిగిం దని తెలిపారు.. భక్తుల క్షేమం, భద్రత, సౌలభ్యం కల్పించడానికి టీటీడీ పటిష్టమైన చర్యలు చేపడు తున్నట్లు వెల్లడించారు.. కేవలం భక్తులకు ఆత్మస్థైర్యం అందిం చేందుకే కర్రలు అందిస్తున్నామని, కర్రలు ఇస్తున్నామని చెప్పిన తర్వాత నాలుగు చిరుతలను బంధించామని, భక్తుల విషయంలో టిటిడి ఎంత బాధ్యతయు తంగా పని చేస్తుందో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ అని చైర్మన్ స్పష్టం చేశారు.. 200 మంది అటవీశాఖ సిబ్బంది నిరంతరాయంగా శ్రమిస్తున్నారని, యాత్రికుల విషయంలో వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని, విమర్శలకు, బూతులకు జడిసి భద్రతా కార్యక్రమాలను ఆపేది లేదంటూ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలియజేశారు.. అనంతరం తిరుపతి వైల్డ్ లైఫ్ డిఎఫ్ఓ సతీష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బోన్లో ట్రాప్ అయిన చిరుతను క్వారంటైన్ కు తరలిస్తున్నామని, దాడి చేసిన చిరుతను గుర్తించేం దుకు శాంపుల్స్ ని పంపించడం జరిగిందన్నారు.. రెండు నడక మార్గాల్లో నిరంతరాయంగా అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు సతీష్ రెడ్డి తెలిపారు..

## గోడ కూలి ముగ్గురు మృతి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: హైదరాబాద్ కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని అడ్డగుట్ట సొసైటీ కాలనీలో ఘోర ప్రమాదం జరిగింది. నిర్మాణంలో ఉన్న భవనం గోడ కూలి ముగ్గురు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. నిర్మాణంలో ఉన్న భవనంలోని ఆరో అంతస్తులో కార్మికులు సెంట్రింగ్ పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే అకస్మాత్తుగా ఒక్కసారిగా ఐదో అంతస్తులోని భవనం గోడ కూలిపోయింది. ఏం జరుగుతుందో తెలుసుకోనేలోపే అనుకున్నదంతా జరిగిపోయింది. దానిపై నిర్మించిన సెంట్రింగ్ కర్రలు విరిగిపోవడంతో ఒక్కసారిగా నలుగురు కార్మికులు కింద పడిపోయారు. వారిపై బలంగా సెంట్రింగ్ కర్రలు బలంగా పడటంతో నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శబ్దం రావడంతో స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు పెట్టారు. పక్కనే బిల్డింగ్ గోడ కూలిపోయి కూలీలు చనిపోవడంతో చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తీవ్ర గాయాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు.

## ఉపాధ్యాయుల బదిలీ దరఖాస్తులు జాగ్రత్తగా పరిశీలించాలి

### జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఏ .రవీందర్ రెడ్డి

నిర్మల్ - ప్రభాత సూర్యుడు: జిల్లాలో బదిలీకి దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల దరఖాస్తులను పాత జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరిశీలన జరుపుతున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఏ. రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి దరఖాస్తుల పరిశీలనకు గజిటెడ్ ప్రధానోపాధ్యాయులచే ఐదు కౌంటర్లు ఏర్పాటు చేసి, ఉపాధ్యాయుల నుండి దరఖాస్తుల ఆన్లైన్ ప్రింట్ లను స్వీకరించామని, వాటిని పరిశీలన చేసి ప్రత్యేక ఐదు కౌంటర్ల ద్వారా ఆన్లైన్లో వెంటవెంటనే అప్డేట్ చేసి అప్రూవ్ చేయడం జరుగుతుందని తెలిపారు. పరిశీలన సిబ్బంది, జాగ్రత్తతో ప్రతి అప్లికేషన్ను తగిన రుజువులతో పరిశీలన చేయాలని, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం ఇవ్వరాదని ఆయన తెలియజేశారు. అవసరమైన రుజువులు పెట్టనీ ఎడల, వాటిని తెప్పించి మరీ వారి దరఖాస్తులకు జత చేయించాలని ఆయన తెలిపారు. ముఖ్యంగా స్పెషల్ కేటగిరి, ప్రిఫరేన్సీయల్ కేటగిరి వారి దరఖాస్తులను, రుజువు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. పరిశీలన సిబ్బంది, ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఓపికతో వ్యవహరించి, ఎటువంటి తప్పులు లేకుండా, ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియను చేపట్టాలని ఆయన కోరారు.

## మహిళపై కత్తితో దాడి.. గాయాలు

ఖమ్మం- ప్రభాత సూర్యుడు: ఖమ్మం జిల్లా వైరా బీసీ కాలనీ లో అర్ధరాత్రి కత్తితో వ్యక్తి హల్చల్ చేసాడు. ఒక మహిళపై దాడికి దిగారు. బీసీ కాలనీకి చెందిన రాంకీ కొనిజర్ల గ్రామానికి చెందిన ఒక వివాహేతతో అక్రమ సంబంధం పెట్టు ఉన్నాడనే అనుమానంతో వివాహిత భర్త రాంకీ ఇంటిపై దాడి జరిపాడు. ఆ సమయంలో ఇంట్లో రాంకీ లేకపోవడంతో వివాహిత భర్త రాంకీ తల్లి పై కత్తితో దాడికి దిగారు. దాడి అనంతరం దాడి చేసిన కత్తి అక్కడే పడేసి అక్కడి నుంచి పరారైయాడు. దాడిలో గాయపడిన మహిళను మెరుగైన వైద్య నిమిత్తం హుటాహుటిన ఖమ్మం ఆసుపత్రికి తరలించారు

## మాగంటి దౌర్జన్యాలకు భయపడేది లేదు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ దౌర్జన్యాలకు భయపడేది లేదని బిజెపి నాయకురాలు కీర్తి రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాగంటి అవినీతి అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రౌడీ లచే దౌర్జన్య కాండ కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఆయన చేసే తప్పిదాలను ప్రశ్నిస్తే సొంత పార్టీ నేతలు సైతం వదలకుండా కేసులు పెట్టించడమే కాకుండా దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. రాఖీ పండగ రోజు పోలీసులకు రాఖీ కట్టేందుకు వెళ్తే తనకు ఎఫ్ ఐ ఆర్ ను బహుమతిగా ఇచ్చారని అన్నారు. గూగుల్, యూట్యూబ్ వంటి వాటిల్లో సెర్చ్ చేస్తే మాగంటి దౌర్జన్య కాండే దర్శనమిస్తుందని, వాటిపై కూడా కేసులు పెడతారా అని నిలదీశారు.ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన పథకాలలో తీవ్ర అవినీతి అక్రమాల పాల్పడుతున్నారని అన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి దళిత బందు ఇచ్చారని ఆరోపించారు. నియోజకవర్గంలో రౌడీషీటర్ల కదలికలపై పోలీసులు చర్యలు తీసుకోరా, వారికి ఎలాంటి కౌన్సిలింగ్ ఇవ్వరా అని అడిగారు. మాగంటి అక్రమాలపై బయట పెడతానని కీర్తి రెడ్డి తెలిపారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215